సాక్షి
శ్రీకాకుళం
సోమవారం ౹ 20 ౹ నవంబర్ ౹ 2023



పరిశోధనలే కీలకం

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా బాలాజీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడారు. - 8లో



ప్రథమ చికిత్స కిట్లు..

అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రథమ చికిత్స కిట్లు అందించారు. ఈ కిట్టులో ఏడు రకాల మందులు ఉంటాయి. - 8లో

రావివలస యాత్రకు భారీ బందోబస్తు

టెక్కలి రూరల్: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా టెక్కలి రావివలసలోని ఎండల మల్లికార్జున స్వామి యాత్రకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ బాలచంద్రా రెడ్డి, సీఐ చంద్రమౌళితో పాటు సుమారు నలుగురు ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలతో కూడిన 60మంది పోలీసులను బందోబస్తు ఏర్పాట్లలో ఉంచినట్లు టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ ఆదివారం తెలిపారు.

న్యూస్‌రీల్

ఉత్తమ పర్యాటక రంగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి: పర్యాటక శాఖ-2024 అవార్డులకు గాను ఉత్తమ పర్యాటక రంగాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖాధికారి ఎన్.నారాయణరావు ఓ ప్రకటనలో తెలియజేశారు. వారసత్వ పర్యాటకం, వ్యవసాయ పర్యాటకం, కళాఖండాలు, బాధ్యతాయుత పర్యాటకం, శక్తివంతమైన గ్రామాలు, కమ్యూనిటీ ఆధారితం, వెల్‌నెస్ రంగాలకు సంబంధించిన రంగాల వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, రూరల్.టూరిజం.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని ఆయన తెలియజేశారు. మరిన్ని వివరాలకు 6309942033 నంబర్‌కు సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

మాజీ సైనికులకు లైఫ్ సర్టిఫికెట్ మేళా



లైఫ్ సర్టిఫికెట్ల మేళాలో పాల్గొన్న కమాండెంట్ కల్నల్ విక్రాంత్ పాండే

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంని ఉన్న మిలిటరీ క్యాంటీన్ వద్ద ఆదివారం మాజీ సైనికులకు లైఫ్ సర్టిఫికెట్ మేళాను నిర్వహించారు. జిల్లా మాజీ సైనిక సమాఖ్య అధ్యక్షులు కె.పూర్ణచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఆడమ్ కమాండెంట్ కల్నల్ విక్రాంత్ పాండే నేతృత్వంలో సుమారు 25 మంది మాజీ సైనికులు, వీర నారీమణులకు, వీర మాతలకు లైఫ్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్వింగ్ సోల్జర్ సుమంత్ సింగ్, స్థానిక మిలటరి క్యాంటీన్ మేనేజర్ తర్రా కృష్ణారావు, జిల్లా సంఘ గౌరవాధ్యక్షులు తమ్మినేని కృష్ణారావు, ఉపాధ్యక్షులు వి.సూర్యనారాయణ, ఏవీ జగన్‌మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంచార జాతుల సమస్యలు పరిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న పిరియా విజయ

సోంపేట : సంచార జాతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట పట్టణంలోని చౌడేశ్వరి కల్యాణ మండపంలో సంచార జాతుల అభివృద్ధి మండలి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సంచార జాతుల రాజ్యాంగ హక్కుల జయభేరి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పిరియా విజయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, సంచార జాతుల రాజ్యాంగ హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాస రావు, జిల్లా అధ్యక్షుడు కొయిరి కృష్ణకుమార్, జిల్లా కార్యదర్శి తెల్లి వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నరసింహ అవతారంలో బ్రహ్మ జనార్ధనుడు



నరసింహ అవతారం

సోంపేట: బారువ గ్రామంలో కొలువై ఉన్న బ్రహ్మ జనార్ధన స్వామి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులకు నరసింహావతారంలో దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు భువనేశ్వర్ పాణిగ్రాహి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బారువ పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సర్వం శివమయం



శివపూజకు సమయం ఆసన్నమైంది. పవిత్ర కార్తీక మాసంలో హరుని అర్చించేందుకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. తొలి సోమవారం నాడు పరమ శివుడిని అభిషేకించేందుకు సర్వాంగ సుందరంగా సన్నద్ధమయ్యాయి. జిల్లాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలైన శ్రీముఖలింగం, రావివలస, శ్రీకాకుళం ఉమారుద్రకోటేశ్వర స్వామి ఆలయంతో పాటు ప్రతి శివాలయాన్ని సిద్ధం చేశారు.



రావివలస ఆలయం వద్ద కార్తీక మాసం సోమవారాల పూజలకు చేసిన ఏర్పాట్లు

● కోటేశ్వరుడి కోవెల సిద్ధం

శ్రీకాకుళం కల్చరల్: కార్తీక మాసం మొదటి సోమవారానికి శ్రీకాకుళంలోని బలరామ ప్రతిష్ఠిత ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయం సిద్ధమైంది. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుంకరి కృష్ణ, ఆలయ ఈఓ రాధాకృష్ణ, ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి తెలిపారు. కార్తీక మాసంలో దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమిలు పంచరత్నాల వంటివని, ఆ రోజుల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అమావాస్య తదుపరివచ్చే త్రయోదశితో కూడిన చతుర్దశినాడు మాస శివరాత్రి సందర్భంగా కూడా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామన్నారు. ఆఖరిదైన నాల్గో సోమవారం స్వామికి 2016 రుద్రాక్షలతో పూజ చేసి అలంకరిస్తామన్నారు. ఉదయం 3గంటల నుంచి ఆలయ ప్రవేశం ఉంటుందని, సాయంత్రం 6 గంటల నుంచి శ్రీరాజరాజేశ్వరీ మహిళా మండలి ఆధ్వర్యంలో సామూహిక లలితా సహస్ర నామ పారాయణ ఉంటుందని తెలిపారు.

ప్రత్యేక ఉచిత క్యూలైన్లు

మొదటి సోమవారాన్ని దృష్టిలో పెట్టుకొని అధికంగా వచ్చే భక్తులు ప్రశాంతంగా దర్శనాలు చేసుకునేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశామని ఈఓ తెలిపారు. ఉచిత క్యూలైన్లు, రూ.20 దర్శనాలు, రూ.50లు శీఘ్ర దర్శనాల కోసం, వీఐపీల కోసం ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేశామని, ఉచిత ప్రసాద వితరణ, తాగునీరు కూడా జరుగుతుందని తెలిపారు. నాగావళి నదిని భక్తుల సౌకర్యార్థం కోసం పరిశుభ్రం చేయించామని, భక్తులు ఎండ బారిన పడకుండా షామియానాలు, లైటింగ్, స్వామికి నాలుగు సోమవారాలు ప్రత్యేక పూల అలంకరణ ఏర్పాటు చేశామని తెలిపారు. మెడికల్ క్యాంపు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయం

● రావివలస సన్నద్ధం

టెక్కలి: ప్రపంచంలోనే అతి ఎత్తైన స్వయంభూలింగంగా విరాజిల్లుతున్న రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీక సోమవారం ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జిల్లా నలుమూలలతో పాటు సుదూర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తుల దర్శనానికి అనుకూలంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ మాజీ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, ఉత్సవాల ప్రత్యేకాధికారి వీవీఎస్ నారాయణ, గ్రామ సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, ఎంపీటీసీ మన్నేల కిశోర్‌తో పాటు సభ్యులు, అధికారులు, గ్రామస్తుల పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మల్లన్నతో పాటు పక్కనే ఉన్న సీతకోనేరు, అందులో ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాలతో పాటు కొండపై ఉన్న సీతమ్మ పాదాల పర్ణశాలకు హంగులు దిద్దారు. వీటితో పాటు మల్లన్న ఆలయానికి ఎదురుగా కొండపై వెలసిన శ్రీ లలితా దేవి ఆలయంలో కార్తీకమాస పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆలయానికి చేరుకునే మార్గాలు

ఈ ఎండల మల్లికార్జునుడి ఆలయానికి చేరుకునేందుకు రోడ్డు, రైల్వే మార్గాలు సదుపాయంగా ఉన్నాయి. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నుంచి టెక్కలి చేరుకుని అక్కడ నుంచి 4 కిలోమీటర్ల దూరంలో గల ఈ ఆలయానికి చేరుకునేందుకు అనేక బస్సులు, ఆటోల సదుపాయం కలదు. రైల్వే మార్గం విషయానికి వస్తే టెక్కలితో పాటు సమీపంలో సుమారు 5 కిలోమీటర్ల దూరంలో నౌపడ రైల్వే స్టేషన్, 20 కిలోమీటర్ల దూరంలో పలాస రైల్వే స్టేషన్‌కు రైల్వే మార్గంలో చేరుకుని అక్కడ నుంచి బస్సులు, చిన్నపాటి వాహనాల్లో ఈ ఆలయానికి చేరుకోవచ్చు.



ఎండల మల్లికార్జునస్వామి

● ముస్తాబైన ముఖలింగం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం కార్తీక సోమవారం పూజలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కార్తీక మాసమంతా ఒక ఎత్తు అయితే సోమవారాల్లో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వస్తారు. గత వారం అమావాస్య ఘడియలు ఉండడంతో ఈ వారం భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంటుందని దేవాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఆలయ ఆవరణ, లోపలి భాగంలోతోపాటు వారాహి అమ్మవారు, ముందు భాగం, దక్షిణ ద్వారం వద్ద భక్తులకు ఎండ తగలకుండా షామియానాలు ఏర్పాటు చేసినట్లు ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు. అలాగే భక్తులు స్వామివారి దర్శనం సులువుగా చేసుకునేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆదివారం స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు.



శ్రీముఖలింగంలో షామియానాలు

వలసల నిర్మూలన ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి సీదిరి అప్పలరాజు

ఎచ్చెర్ల క్యాంపస్: మత్స్యకారుల వలసల నిర్మూలన ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మత్స్యశాఖ, పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనుల కోసం స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో కలిసి ఆయన ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో సీఎం వైఎస్ జగన్ వర్చువల్‌గా ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ హార్బర్‌ను రూ.365.08 కోట్లతో నిర్మించనున్నారు. మంత్రి మాట్లాడుతూ స్థానికంగా ఉపాధి లభించాలంటే చేపల వేటకు అనుకూల వాతావరణం, మార్కెటింగ్ అవసరమని తెలిపారు. ఈ ప్రాంత మత్స్యకారులకు హార్బర్ ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. నిర్ణీత కాల వ్యవధిలో పనులు పూర్తి చేస్తామన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఎచ్చెర్ల, రణస్థలం మత్స్యకారులకు జీవనోపాధి, ఉపాధి లక్ష్యంగా ఈ ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, జెడ్పీటీసీ బల్లాడ హేమమాలినీరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ముద్దాడ శంకర్, జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దన రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అంబటి రాంబాబు, నాయకులు మైలపల్లి కామరాజు, నాయకులు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



బుడగుట్లపాలెంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

అరసవల్లిలో కార్తీక సందడి

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో కార్తీక మాస సందడి కనిపించింది. కార్తీక మాసం తొలి ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి ప్రత్యేక పూజలను చేశారు. అలాగే క్షేత్ర పాలకులైన భువనేశ్వరి సహిత రామలింగేశ్వర స్వామిని కూడా దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించుకున్నారు. ఇక ఇంద్రపుష్కరిణిలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించి అరటితెప్పలను నీటిలో వదిలారు. ఇక కొందరు భక్తులు కేశఖండన శాలలో తలనీలాలను సమర్పించుకున్నారు. అలాగే మరికొందరు ఆరోగ్యం కోసం సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు, ముఖ్యులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్య ప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసం సందర్భంగా పుష్కరిణి వద్ద దీపాలను వదిలేలా చర్యలు చేపట్టారు. ఆదివారం ఒక్కరోజే వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,51,500, విరాళాల ద్వారా రూ.82,966, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలిపారు.



ఇంద్ర పుష్కరిణిలో దీపాలు వదులుతూ పూజలు చేస్తున్న మహిళలు

'అంబేడ్కర్ జీవితం నేటి తరానికి ఆదర్శం'



మాట్లాడుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: అంబేడ్కర్ జీవితం నేటి తరానికి ఆదర్శ ప్రాయమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. ఎచ్చెర్లలో ఆదివారం అంబేడ్కర్ జాతర సభ నిర్వహించారు. ముందుగా యాత్రలో భాగంగా ర్యాలీ చేసి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత తప్పనిసరిగా అంబేడ్కర్ జీవితాన్ని చదవాలని సూచించారు. వర్సిటీలో అంబేడ్కర్ చైర్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ చింతకింద ఖాసిం మాట్లాడుతూ ప్రజల కోసం బతికారు కాబట్టే అంబేడ్కర్ జనం మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించారని అన్నారు.

కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు కల్లేపల్లి రామ్‌గోపాల్, కుల నిర్మూలన పోరాట సమితి ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, సామాజిక న్యాయ పోరాట సమితి కార్యదర్శి దుర్గాసి గణేష్, దళిత పోరాట నాయకులు చల్ల రామారావు, ఎండ్ల గోపి, దెబారిక రాము, రామారావు, మహేంద్ర పాల్గొన్నారు.

● క్రీడాభిమానం



క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా జిల్లా టీవీలకు అతుక్కుపోయింది. జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అయితే మ్యాచ్ ఓడిపోవడంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. శ్రీకాకుళం మున్సిపల్ మైదానంలో పెద్ద స్క్రీన్ వద్దకు ఇలా భారీగా అభిమానులు తరలివచ్చి మ్యాచ్ చూశారు.

- శ్రీకాకుళం న్యూకాలనీ

భక్తిశ్రద్ధలతో గౌరమ్మ నిమజ్జనం



గౌరమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: పెద్దబొడ్డపాడులో కార్తీక పౌర్ణమి రోజున కొలువుదీరిన గౌరమ్మను శనివారం రాత్రి నిమజ్జనం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మను ఊరేగించి అనుపు ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు ఉన్నారు.

'పంచారామాల బస్సులను వినియోగించుకోండి'

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో పంచారామాలకు నడుపుతున్న ప్రత్యేక బస్సులను భక్తులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ పి.మల్లికార్జునరాజు అన్నారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆదివారం సాయంత్రం పంచారామాలకు రెండు ప్రత్యేక బస్సులు బయల్దేరాయి. ఈ బస్సులను శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ పి.మల్లికార్జునరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో పంచారామాలైన అమరావతి, ద్రాక్షారామం, పాలకొల్లు, సామర్లకోట, భీమేశ్వరం తదితర పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు బయల్దేరి వెళ్లిన భక్తులు సోమవారం పంచారామాలను దర్శించుకుని మళ్లీ మంగళవారం వేకువజామునకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటవ డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, ఎస్ఎం కె.నరేంద్ర, టీఐ-3 ఎల్ఎస్ నాయుడు, ఆర్టీసీ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.



పంచారామాలకు బయలుదేరిన బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మల్లికార్జునరాజు



జగనన్న దయతో



ఇంటి వద్ద బగ్గు భవాని

మాది ఎల్.ఎన్.పేట మండలం దబ్బపాడు గ్రామం. సుమారు 15 ఏళ్ల క్రితం నా భర్త నుంచి విడిపోయి దబ్బపాడు గ్రామంలోని కన్నవారింటికి చేరాను. కన్న వారి ఇంటి నుంచి కూడా ఐదేళ్ల కిందట బయటకు వచ్చేసి అద్దె ఇళ్లలో ఉంటూ కూలి పనులు చేసుకునేదాన్ని. చిన్న పాక వేసుకుందామన్నా కనీసం ఇంటి స్థలం కూడా లేదు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక నాకు ఇంటి పట్టా వచ్చింది. కాలనీ ఇల్లు కూడా మంజూరు కావటంతో ఇంటి నిర్మాణ పనులు చేపట్టాను. నావంటి వారికి స్థలమిచ్చి ఇల్లు కట్టించిన జగనన్న కలకాలం ముఖ్యమంత్రిగా కొనసాగాలి.

- భవానీ, దబ్బపాడు ఎల్ఎన్‌పేట

కల నిజమైంది..

మా జీవితంలో సొంత ఇల్లు కలగానే మిగిలిపోతుందని అనుకున్నాం. కానీ మాకు కవిటిలో జగనన్న కాలనీలో స్థలం ఇచ్చారు. ఏడాదిలోపే మాకు పొందికైన ఇంటిని కట్టుకున్నాం. ఏడాదిలోపు ఇల్లు కట్టుకోగలమని ఎన్నడూ అనుకోలేదు. మా పాపకు అమ్మ ఒడి పథకం, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక పథకాల ద్వారా పుస్తకాలు, దుస్తులు, షూలు,మంచి నాణ్యమైన భోజనం అందించారు. మా అబ్బాయి ఇంజినీరింగ్‌కు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎంతగానో ఆదుకుంది. మాబోటి కుటుంబాల్లో ఓ యువకుడు ఇంజినీర్ కావడం, సొంతిల్లు కట్టుకోవడం అనే కలలు సీఎం నిజం చేశారు. - నెయ్యిల రజినీ, కవిటి (కవిటి)



ఇంటి వద్ద రజినీ

24న శ్రీకూర్మనాథుని తెప్పోత్సవం

గార: ప్రముఖ విష్ణుక్షేత్రంలో ఈ నెల 24న క్షీరాబ్ది ద్వాదశి పురస్కరించుకొని తెప్పోత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ జి. గురునాథం, ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆలయం ఎదురుగానున్న శ్వేతపుష్కరిణిలో తెప్పలపై శ్రీకూర్మనాథుడు విహరించనున్నారు. శతాబ్దాల నుంచి జరుగుతున్న మాదిరిగానే కర్ర తెప్పలపై ఈ ఉత్సవం ఉంటుందన్నారు. ఉత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు.

క్లుప్తంగా

వెలుగు సీఎఫ్ తొలగింపు

సంతబొమ్మాళి: నౌపడ పంచాయతీ పాలనాయుడుపేట గ్రామ సమైక్య సంఘానికి చెందిన వెలుగు సీఎఫ్ పి.సుమలతను గ్రామ సమైక్య సభ్యులు ఆదివారం తొలగించారు. వెలుగు సీఎఫ్ చేతివాటం అనే శీర్షికన శనివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తపై అధికారులు స్పందించారు. గ్రామ సమైక్య సంఘం సభ్యులందరూ ఏపీఎం సూర్యనారాయణ ఆధ్వర్యంలో నౌపడలో సమావేశమయ్యారు. సీఎఫ్ పై వచ్చిన అవినీతి వాస్తవమని తేలడంతో సంఘ సభ్యులంతా తొలగిస్తున్నట్లు తీర్మానం చేసి కాపీని అధికారులకు అందజేశారు. దీంతో సీఎఫ్ సుమతలను తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఇచ్ఛాపురం జనసేన ఆశలు గల్లంతు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గానికి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా బెందాళం అశోక్ బరిలో నిలుస్తారని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రకటించడంతో ఇప్పటి వరకు ఆశలతో ఉన్న ఇచ్ఛాపురం జనసేన కార్యకర్తల్లో ఒక్కసారిగా నైరాశ్యం అలముకుంది. జనసేనకు చెందిన దాసరి రాజు, లోళ్ల రాజేష్‌లు ఎమ్మెల్యే సీటు ఆశిస్తుండగా ఎంపీ ప్రకటనతో వారి ఆశలపై నీళ్లు జల్లినట్లైంది. గత ఎన్నికల్లో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా దాసరి రాజు ఓడిపోయినా పార్టీని వీడకుండా క్యాడర్‌తో కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇప్పుడు అశోక్‌కు ఎమ్మెల్యే టికెట్ ఖరారు చేయడంతో ఆయన అయోమయంలో పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు




సంఘటనా స్థలంలో ఉన్న కారు, ద్విచక్ర వాహనం

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్రాం గ్రామానికి చెందిన కొల్లి సింహాచలం తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన కూరగాయలు కొనేందుకు సత్రాం నుంచి అలుదు వచ్చి తిరిగి బైక్‌పై వెళ్తుండగా నరసన్నపేట నుంచి పాతపట్నం వైపు వెళ్తున్న కారు ఢీ కొనడంతో కాలు విరిగింది. దీంతో క్షతగాత్రుడిని 108 వాహనంలో శ్రీకాకుళం తరలించారు. కారు డ్రైవర్ పోలాకి సందీప్‌కుమార్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్లే ప్రమాదం జరిగిందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై హెచ్‌సీ కృష్ణారావు కేసు నమోదు చేసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గంజాంలో 'గజ'గజ

- ఆదివాసీ గ్రామాల్లో చొరబడిన ఏనుగులు
- ఆటోడ్రైవర్ మృత్యువాత
- చెల్లాచెదురైన ధాన్యం, చెట్లు
- భయాందోళనలో స్థానికులు



హడపడా గ్రామంలో చొరబడుతున్న ఏనుగుల గుంపు

బరంపురం : గంజాం జిల్లాలో గజేంద్రులు హల్‌చల్ చేశాయి. జగనాథ్‌ప్రసాద్ అటవీరేంజ్ సన్నొఖేముండి బ్లాక్ పరిధిలో హడపడా గ్రామంలోకి ఏనుగుల గుంపు ప్రవేశించి బీభత్సం సృష్టించాయి. ఓ ఆటోడ్రైవర్ ప్రాణాలు కోల్పోగా, పెద్ద ఎత్తున ధాన్యం, చెట్లు నాశనమయ్యాయి. అటవీ అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హడపడా గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రఘునాథ్ మల్లిక్ (40) ప్రయాణికులను ఎక్కించుకుని గోప్త ఆరోగ్య కేంద్రానికి వచ్చాడు. అక్కడకి దగ్గరలో ఏనుగులు ఉన్నట్లు సమాచారం తెలుసుకుని అటువైపుగా వెళ్లగా ఏనుగులు గుంపు ఒక్కసారిగా దాడికి దిగాయి. డ్రైవర్ పరుగులు తీస్తుండగా కింద పడటంతో తల్లి ఏనుగు కోపంతో మల్లిక్‌ని పైకెత్తి పడేసింది. తీవ్రంగా గాయపడిన మల్లిక్‌ను అదే ఆటోలో తొలుత సన్నొఖేముండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎంకేసీజీలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అదే రోజు రాత్రి సమీపంలోని లకాడి పర్వత ప్రాంతంలో సంచరిస్తున్న 13 ఏనుగుల గుంపు అడపడా గ్రామంలో చొరబడి బీభత్సం సృష్టించాయి. గ్రామ శివారున ఉన్న వరి ధాన్యం, వృక్షాలను చెల్లాచెదురుగా చేశాయి. సమాచారం తెలుసుకున్న దిగపండి అటవీ రేంజ్ అధికారులు ఆదివారం గ్రామానికి చేరుకున్నారు. ఏనుగుల గుంపును అటవీ ప్రాంతంలోకి తరిమేందుకు చర్యలు చేపట్టారు. మరోవైపు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట ఎక్కడ దాడి చేస్తాయోనని ఆందోళనకు గురవుతున్నారు. అటవీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిశోధనలే కీలకం

- పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత
- 'సాక్షి'తో శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్ కొత్త డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ

సాక్షి ఇంటర్వ్యూ



ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులను ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విద్యా సంస్థ(ఆర్‌జీయూకేటీ) కొత్త డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. శ్రీకాకుళం క్యాంపస్ ఐదో డైరెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన ఈయన విశాఖపట్నంలోని గీతం విశ్వవిద్యాలయంలో సుదీర్ఘకాలం ప్రొఫెసర్ సేవలందించారు. ఇదే సంస్థలో 2019 నుంచి 2021 వరకు రిజిస్ట్రార్‌గా పనిచేశారు. రిటైరయ్యాక అక్కడే విశిష్ట ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. స్టూడెంట్ అఫైర్స్ డీన్, విభాగాధిపతి, రీసెర్చ్ డైరెక్టర్, బోర్డాఫ్ స్టడీస్ చైర్మన్ వంటి కీలక బాధ్యతలు నిర్వర్తించారు. విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు వంటి పట్టణాల్లో భవన, సివిల్ నిర్మాణ సలహా కమిటీల్లో పనిచేశారు. సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా సుదీర్ఘ అనుభం ఉంది. తన ప్రాధాన్యతలు, లక్ష్యాలను ప్రత్యేకంగా 'సాక్షి'కి వివరించారు.

సాక్షి: శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ నియామకం పట్ల మీ స్పందన?

డైరెక్టర్: ప్రతిష్టాత్మక విద్యా సంస్థకు డైరెక్టర్‌గా అవకాశం రావటం జీవితంలో మైలురాయిగా భావిస్తున్నాను. ఇందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యాభివృద్ధికి కృషి చేస్తాను.

సాక్షి: మీ ముందున్న లక్ష్యాలు?

డైరెక్టర్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందాలి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ సంస్థలో చేరుతున్నారు. వారిలో ప్రతిభ వెలికితీయాలి. అప్పుడే వారు అత్యున్నత స్థాయికి చేరుతారు. విద్యార్థులను ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దటం, విద్య, ఉద్యోగ, ఉపాధికి దోహదపడటం, సమాజానికి సైతం విద్య ఉపయోగపడటం వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తున్నాం.

సాక్షి: మౌలిక వసతులు, బోధన సిబ్బందిపై మీ అభిప్రాయం?

డైరెక్టర్: ప్రభుత్వం మౌలిక వసతులకు ప్రాధాన్యమిస్తోంది. ఆరు వేల మంది విద్యార్థులకు సరిపడా అకడమిక్, హాస్టల్ భవనాల నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగుతోంది. రెగ్యులర్ పోస్టుల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ సైతం విడుదలైంది. పరిశోధన, నూతన ఆవిష్కరణలకు విద్యలో ప్రాధాన్యత పెరుగుతుంది.

సాక్షి: కరిక్యులమ్‌లో ఎటువంటి మార్పులు అవసరం?

డైరెక్టర్: ఇంజినీరింగ్‌లో సిలబస్ కంటే పారిశ్రామిక అవసరాలు కీలకం. విద్యార్థుల్లో నైపుణ్యాలు, పారిశ్రామిక అవసరాలు లక్ష్యంగా విద్య కొనసాగాలి. సిలబస్‌లో అవసరానికి తగ్గ మార్పులు, పరిశ్రమ అవసరాలు తెలుసుకునేందుకు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అమలు వంటివి కీలకం.

సాక్షి: గ్రామీణ విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

డైరెక్టర్: గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో కష్టపడే తత్వం, విషయ పరిజ్ఞానం ఎక్కువగా ఉంటాయి. వారిలో ఇంగ్లీష్ భాష, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేత పరిజ్ఞానం వంటి అంశాలు పెంపుదలకు ప్రత్యేక దృష్టి పెడతాం. నిష్ణాతులతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తాం. నైపుణ్యం గల ఇంజినీర్లుగా తీర్చిదిద్దుతాం.

సాక్షి: ప్రస్తుతం ఉన్న వనరులు ఎలా సద్వినియోగం చేసుకుంటారు?

డైరెక్టర్: ప్రస్తుతం ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సేవలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటాం. సమష్టి కృషితో సంస్థను ముందుకు తీసుకువెళతాం.

విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- జేఎన్‌టీయూ విజయనగరం పాలకమండలి సభ్యుడు దువ్వలకు సత్కారం



దుప్పల వెంకటరావును సన్మానిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

శ్రీకాకుళం అర్బన్: విద్యతోనే పేదరిక నిర్మూలన, సామాజిక మార్పు సాధ్యమవుతుందని, వైఎస్ జగన్ ప్రభుత్వం కూడా విద్యకు ప్రాధాన్యత ఇస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. జేఎన్‌టీయూ విజయనగరం పాలకమండలి సభ్యుడిగా దుప్పల వెంకటరావును ప్రభుత్వం నియమించిన సందర్భంగా ఆదివారం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులోని ఆనందమయి కన్వెన్షన్ హాల్‌లో గాయత్రి విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడు అధ్యక్షతన దుప్పల వెంకటరావును ఆత్మీయంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పేదలకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతోందని స్పీకర్ అన్నారు. వివాద రహితునిగా పేరున్న దుప్పల వెంకటరావును జేఎన్‌టీయూ విజయనగరం పాలకమండలి సభ్యునిగా ప్రభుత్వం నియమించడం అభినందనీయమన్నారు.

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. అన్ని రంగాలపై దుప్పల వెంకటరావుకు అవగాహన ఉందని, అలాంటి వ్యక్తికి పాలకమండలి సభ్యునిగా నియమించడం హర్షణీయమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, వరుదు కల్యాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ నిమ్మ వెంకటరావు తదితరులు మాట్లాడుతూ విద్య, సాంస్కృతిక, సాంకేతిక రంగాల్లో తనదైన ముద్రవేసి అందరివాడుగా పేరుపొందిన దుప్పల వెంకటరావుకు పాలకమండలి సభ్యునిగా ప్రభుత్వం నియమించడం సంతోషకరమన్నారు.

దుప్పల వెంకటరావు మాట్లాడుతూ తన ఉన్నతికి తల్లిదండ్రులే కారణమని అన్నారు. ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గుండ అప్పలసూర్యనారాయణ, కూన రవికుమార్, గుండ లక్ష్మీదేవి, నగర ప్రముఖులు డాక్టర్ దానేటి శ్రీధర్, డాక్టర్ కేఎల్ నాయుడు, డాక్టర్ పైడి మహేశ్వరరావు, హనుమంతు కృష్ణారావు, గుంట తులసీరావు, చౌదరి పురుషోత్తమ నాయుడు, దుప్పల రవీంద్రబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రథమ చికిత్స కిట్లు

- కిట్‌లో ఏడు రకాల మందులు
- జిల్లా వ్యాప్తంగా 3,358 కేంద్రాలకు పంపిణీ
- స్వల్ప అనారోగ్యం, చిన్నచిన్న గాయాలకు తక్షణ వైద్యం
- వేయింగ్ మిషన్‌తో ఇతర పరికరాలూ సరఫరా

నరసన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కేంద్రాలకు ప్రథమ చికిత్స కిట్లను పంపిణీ చేసింది. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రథమ చికిత్స చేయడానికి వీలుగా ఈ మెడికల్ కిట్లను సరఫరా చేసింది. వీటిలో ఏడు రకాల మందులు ఉంచింది. టీడీపీ హయాంలో అంగన్ వాడీ కేంద్రాలు అధ్వానంగా ఉండేవి. పౌష్టికాహారం పంపిణీ అంతంత మాత్రంగానే ఉండేది. కానీ వైఎస్సార్ సీపీ వచ్చాక అంగన్‌వాడీ కేంద్రాల తీరు మారింది. పిల్లలకు రక్షిత నీరు అందించేందుకు ప్రత్యేకమైన మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పౌష్టికాహారం పక్కదోవ పట్టకుండా లబ్ధిదారులకు అందించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశారు. కేంద్రాలకు వచ్చే పిల్లల ఆటపాటలకు, అక్షరాల బోధనకు తగిన చర్యలు తీసుకున్నారు. తాజాగా ప్రభుత్వం మంచి ఉద్దేశంతో మెడికల్ ఫస్ట్ ఎయిడ్ కిట్లను జిల్లాలో ఉన్న 3358 అంగన్ కేంద్రాలకు పంపిణీ చేసింది. చిన్నారులకు స్వల్ప అనారోగ్యం, చిన్న చిన్న గాయాలకు తక్షణ వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంది.



వేయింగ్ మిషన్

కిట్‌లో ఏడు రకాల మందులు..

అంగన్‌వాడీ మెడికల్ కిట్‌లో పారాసిట్‌మాల్ సిరప్, ప్రామైసిటిన్ ఆయింట్‌మెంట్, అబ్జార్బెంట్ కాటన్, సిప్రోఫ్లాక్సిన్ చుక్కల మందు, పోవిడిన్ అయోడిన్, ఓఆర్ఎస్, రోలర్ బ్యాండేజ్‌లతో పాటు ఐరన్ ట్యాబ్లెట్లు, ఫురాజోలిడిన్, హ్యాండ్ శానిటైజర్, నియోమైసిన్ ఆయింట్‌మెంట్, కాటన్, బెంజయిల్, బెంజోయేట్ తదితర మందులు ఉంటాయి. వీటిలో ఏయే మందులు ఎలా ఉపయోగించాలో సమాచారం కూడా పంపించారు. వీటి వినియోగంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు.

మందుల వినియోగం ..

జ్వరం: పారాసిటమాల్ సిరప్‌ను రెండు నెలల లోపు పిల్లలకు ఒక మిల్లీలీటర్ చొప్పున రోజుకు రెండు సార్లు, ఏడాది లోపు పిల్లలకు ఐదు మిల్లీమీటర్లు చొప్పున ఇవ్వాలి.

తెగిన, గీరుకొనే గాయాలు అయితే: ప్రామైసిటిన్ స్కిన్ క్రీమ్ ఆయింట్‌మెంట్‌ను గాయమైన చోట నీటితో శుభ్రంగా కడిగి రాయాలి. అవసరమైతే దూది(కాటన్) పెట్టి కట్టు కట్టాలి.

కళ్లు ఎర్రబడటం: సిప్రోఫ్లాక్సాసిన్ చుక్కల మందును 2 చుక్కలు చొప్పున కళ్లల్లో రోజుకు రెండు నుంచి మూడు సార్లు వాడాలి. చెవి పోటు ఉన్నా ఇలానే చెవిలో చుక్కలు వేయాలి.

డీహైడ్రేషన్ అవ్వకుండా : ఓరల్ రీ హైడ్రేషన్ సాల్ట్స్ రెండేళ్ల లోపు పిల్లలకు 50 నుంచి 100 మిల్లీ లీటర్లు, రెండు నుంచి పదేళ్లలోపు పిల్లలకు 100 నుంచి 200 మిల్లీ మీటర్లు చొప్పున ఇవ్వాలి.

కేంద్రాలన్నింటికీ మెడికల్ కిట్లు



కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకొని అన్ని కేంద్రాలకు ప్రాథమిక మెడికల్ కిట్లు పంపిణీ చేశాం. అలాగే వేయింగ్ మిషన్లు (నాలుగు రకాలు) కార్యకర్తలకు, ఆయాలకు యూనిఫారమ్(ఆరు చీరలు) ప్రీ స్కూల్ కిట్ (ఆటలు ద్వారా విద్య నేర్చుకొనే వస్తువులు) పంపిణీ చేశారు. ప్రస్తుతం అంగన్ వాడీ కేంద్రాల్లో సమృద్ధిగా పరికరాలు ఉన్నాయి.

– నాగమణి, పీఓ, ఐసీడీఎస్, నరసన్నపేట

ఆకట్టుకున్న నాటిక పోటీలు



కళాకారులకు శాలువాలు కప్పి సత్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు: కొత్తూరులోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల స్థాయి పౌరాణిక, జానపద నాటక పోటీలు ఆకట్టుకున్నాయి.

కొత్తూరుకు చెందిన సూర్యకళా రంగస్థల జానపద కళాకారుల సంక్షేమ సేవా సమాఖ్య సంఘం 5వ వార్షికోత్సవం సందర్భంగా సంఘం వ్యవస్థాపకుడు కె.పార్వతీశం ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం విశాఖ పట్నంకు చెందిన వందలాది మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులను సత్కరించారు. కళారంగాన్ని ఆదుకోవాలని వక్తలు కోరారు.

రాష్ట్రపోటీలకు సన్నద్ధం కావాలి



సత్కారం అందుకున్న మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ ప్రతినిధులు, అథ్లెట్స్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు శ్రీకాకుళం జిల్లా అథ్లెట్స్ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డేపల్లి నారాయణరావు పిలుపునిచ్చారు. తిరుపతి వేదికగా డిసెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు 42వ ఏపీ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరగనున్న నేపథ్యంలో ఆదివారం శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న ఎన్జీఓ గెస్ట్‌హౌస్ వేదికగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డేపల్లి నారాయణరావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించిన విషయాన్ని గుర్తు చేస్తూ.. శ్రీకాకుళంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటైన వెంటనే జాతీయ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. సంఘ ప్రధాన కార్యదర్శి పాలకొండ అప్పారావు మాట్లాడుతూ జిల్లాలో అద్భుతమైన నైపుణ్యం, టైమింగ్ కలిగిన మాస్టర్ అథ్లెట్స్ ఉన్నారని గుర్తుచేస్తు.. రాష్ట్ర పోటీలకు సమయం సమీస్తున్న దృష్ట్యా సన్నద్ధం కావాలన్నారు. సమీపంలోని క్రీడామైదానాల్లో నిర్దేశించుకున్న ఈవెంట్స్‌లో శిక్షణ పొందాలన్నారు. ఈ సందర్భంగా బొడ్డేపల్లి నారాయణరావు, పాలకొండ అప్పారావు, చల్లా జగదీష్, లింగాల ప్రసాదరావు, జీఎం జ్యోతి, సనపల సారధి, అన్నెపు ఈశ్వరరావు, సుధాకరరావులను ఘనంగా సత్కరించారు. క్రీడాదుస్తులను అథ్లెట్స్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు ఎం.భాగ్యలక్ష్మి, ఎం.కామయ్య, యశోద, ఆనంద్, జోగారావు తదితరులు పాల్గొన్నారు. మాస్టర్ అథ్లెట్స్‌కు సంఘ పేట్రన్ చౌదరి పురుషోత్తమనాయుడు బెస్ట్ విసెష్ తెలియజేశారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో మనోళ్లు అ'ద్వితీయం'



రగ్బీ రాష్ట్ర పోటీల్లో రన్నరప్‌గా ట్రోఫీ, పతకాలు అందుకుంటున్న జిల్లా జట్టు క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యద్భుతంగా రాణిస్తున్నారు. ఈ సీజన్ మొత్తం దాదాపుగా అన్ని క్రీడాంశాల్లోను పతకాలు, ట్రోఫీలతో జిల్లాకు తిరిగి వస్తున్నారు. తాజాగా రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్-14 బాలుర రగ్బీ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్-14 బాలబాలికల రగ్బీ చాంపియన్‌షిప్-2023 పోటీలు కర్నూలు జిల్లా కేంద్రం వేదికగా ఈనెల 17 నుంచి 19 వరకు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా బాలికల జట్టు క్వార్టర్స్‌లో నిష్క్రమించగా.. బాలురు జట్టు మాత్రం రన్నరప్‌గా నిలిచి శభాష్ అనిపించింది. అలాగే పలువురు క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. పీడీ ఎస్.సుజాత, నేషనల్ ప్లేయర్ లక్ష్మణరావులు కోచ్ మేనేజర్లుగా వ్యవహరించి జట్లను విజయపథంలో నిలిపారు. జిల్లా జట్టు రాణింపుపై డీఈఓ కె.వెంకటేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, రగ్బీ సంఘ జిల్లా కార్య నిర్వాహన కార్యదర్శి బాడాన నారాయణరావు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ విద్య, సాంస్కృతిక ఉత్సవాల్లో శ్రీకాకుళం టీచర్



అభినందన పత్రాన్ని అందుకుంటున్న పీవీఎస్ఎన్ మూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ విద్యా, సాంస్కృతిక ఉత్సవాల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి ఒకే ఒక్క ఉపాధ్యాయుడు పీవీఎస్ఎన్ మూర్తి పాల్గొని అభినందన పత్రాన్ని అందుకున్నారు. ఈనెల 17 నుంచి 19 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలో నైనిటాల్‌లోని నేషనల్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ఫెస్టివల్ ఆఫ్ టీచర్స్ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా నైరా ప్రైమరీ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పీవీఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు. 23 రాష్ట్రాల నుంచి సుమారు 400 మంది ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు పాల్గొనగా.. ఇందులో జిల్లా నుంచి ఈయన ఒక్కరికే అవకాశం లభించడం విశేషం. ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి భగత్ సింగ్ కోషియారీ చేతుల మీదుగా అభినందన పత్రాన్ని అందుకున్నారు.

జనవరి 23 న పోలమాంబ సిరిమాను సంబరం



శంబర పోలమాంబ

మక్కువ: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర తేదీలను దేవదాయ శాఖ, ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆదివారం ప్రకటించారు. ఆలయ ఈఓ వి.వి.సూర్యనారాయణ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూడి దాలినాయు డు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు చదురుగుడిలో సమావేశమై శంబర పోలమాంబ అమ్మ వారి జాతర తేదీలను నిర్ణయించారు. డిసెంబర్ 18వ తేదీ నుంచి పోలమాంబ అమ్మవారి జాతర ఉత్సవం ప్రారంభం కానుంది.

- డిసెంబర్ 18న పెదపోలమాంబ అమ్మవారిని గ్రామంలోకి తీసుకువచ్చేందుకు సనప సాటింపు వేస్తారు.
- డిసెంబర్ 25న గ్రామంలోకి పెదపోలమాంబ అమ్మవారిని తీసుకువస్తారు.
- జనవరి 1న పెదపోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం.
- జనవరి 2న ప్రధాన పండగ
- జనవరి 3న అనుపోత్సవం. అదే రోజు శంబర పోలమాంబ అమ్మవారిని కొని తెచ్చేందుకు సనప సాటింపు వేస్తారు.
- జనవరి 8న గ్రామంలోకి శంబర పోలమాంబను తీసుకువస్తారు.
- జనవరి 9న అమ్మవారు చదురుగుడిలో విశ్రాంతి తీసుకుంటారు.
- జనవరి 10 నుంచి గ్రామంలోని చదురుగుడిలో అమ్మవారు కొలువై ఉండి, 12 రోజుల పాటు గ్రామంలో తిరువీధి కార్యక్రమం నిర్వహిస్తారు.
- జనవరి 22న తొలేళ్ల ఉత్సవం.
- జనవరి 23న సిరిమానోత్సవం.
- జనవరి 24న అనుపోత్సవం.
- జనవరి 30న మారుజాతర నిర్వహిస్తారు.
- ఫిబ్రవరి 6, 13, 20, 27 తేదీల్లో మూడు, నాలుగు, అయిదు, ఆరవ జాతర నిర్వహిస్తారు.
- మార్చి 3, 12, 19, 26 తేదీల్లో ఏడు, ఎనిమిది, తొమ్మిది, పదవ జాతరలు నిర్వహిస్తారు.
- మార్చి 26వ తేదీన చండీహోమం, మహా అన్నదానం కార్యక్రమాలు నిర్వహించేందుకు దేవదాయ శాఖ, ట్రస్ట్ బోర్డు సభ్యులు, గ్రామపెద్దలు నిర్ణయించారు.

మెడలో కండువా.. చెవిలో పూలు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండలం మండపల్లి పంచాయతీ నుంచి వైఎస్సార్‌సీపీకి చెందిన సుమారు 200 కుటుంబాలు టీడీపీలో చేరాయంటూ టీడీపీ వర్గాలు ఊదరగొట్టాయి. వాస్తవానికి జనసేన, టీడీపీ కార్యకర్తలకే మళ్లీ పార్టీ కండువాలు వేశారని తెలియడంతో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అవాక్కయ్యారు. ఆదివారం ఇచ్ఛాపురం మండలం మండపల్లి పంచాయతీల్లో జరిగిన ఈ సంఘటన వివరాల్లోకి వెళితే.. బాలకృష్ణాపురంలో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ప్రారంభించిన రామ్మోహన్ నాయుడు మండపల్లిలో జరిగిన 'భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు టీడీపీలో చేరతారంటూ ప్రచారం చేశారు.

తీరా చూస్తే జనసేన నాయకుడు అనిల్ సాహుతో పాటు మండపల్లికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలకు పార్టీ కండువా వేసి చేరికలు జరిగినట్లు కలరింగ్ ఇచ్చారు. వారంతా సొంత పార్టీ నాయకులే అని తెలియడంతో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లు స్థానిక మండల టీడీపీ పెద్దలపై అసహనం వ్యక్తం చేశారు.

కండువా ఎందుకు వేశారో..?



చాలా ఏళ్లుగా నేను తెలుగుదేశం పార్టీలో కార్యకర్తగా పనిచేస్తున్నాను. ఈ రోజు మన ఊరిలో మీటింగ్ ఉందని, ఎర్రంనాయుడు కొడుకు వస్తున్నాడని చెప్పి మీటింగ్‌కు పిలిచారు. మీటింగ్‌కు వచ్చిన నన్ను పేరు పెట్టి పిలవడంతో వెళ్లాను. అక్కడ నాకు ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అశోక్‌లు కండువా వేశారు. అసలు నాకు కండువా ఎందుకు వేశారో ఇప్పటికీ అర్థం కావడం లేదు.

– భాస్కర్ బెహరా, మండపల్లి, ఇచ్ఛాపురం మండపల్లి

పిలిచి మరీ కండువా వేశారు



నేను అన్న ఎన్టీ రామారావు పార్టీ పెట్టినప్పటి నుంచి తెలుగుదేశం పార్టీలోనే కార్యకర్తగా ఉన్నాను. ఈ రోజు ఎంపీ, ఎమ్మెల్యేలు మన ఊరు వస్తున్నారంటూ మీటింగ్‌కు పిలిచి వారి చేతుల మీదుగా కండువా వేశారు. నేనేమీ కొత్తగా పార్టీలో చేరలేదు.

– దనపాన దేశబాబు, బుడ్డేపుపేట, ఇచ్ఛాపురం మండలం

ఆరేళ్లుగా టీడీపీలోనే ఉన్నా..



నాపేరు కామరాజు బెహరా. ఆరేళ్ల నుంచి తెలుగుదేశం పార్టీలో కార్యకర్తగా పనిచేస్తున్నాను. మన ఊరులో భవిష్యత్‌కు గ్యారెంటీ ప్రోగ్రాం జరుగుతుందని పిలవడంతో మీటింగ్‌కు వచ్చాను. తీరా ఇక్కడకు వచ్చాక నా మెడలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు కండువా వేశారు.

– కామరాజు బెహరా, మండపల్లి, ఇచ్ఛాపురం మండలం